సాక్షి కామారెడ్డి

శనివారం । 23 । డిసెంబర్ । 2023



ఘనంగా మ్యాథ్స్ డే

జిల్లాలో శుక్రవారం మ్యాథ్స్ డేను ఘనంగా నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు నివాళులు అర్పించారు.

- 9లో ▸



సమస్యలపై చర్చించేనా?

కామారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యేగా కేవీఆర్ తొలిసారి పాల్గొననున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.6 /9.0

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

జుక్కల్‌లో గజగజ

కనిష్ట ఉష్ణోగ్రత 9 డిగ్రీలు నమోదు



కామారెడ్డి క్రైం: జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. గురువారం జుక్కల్‌లో అత్యల్పంగా 9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యల్పం. మద్నూర్ మండలం మేనూర్‌లో 9.2, బీబీపేటలో 9.4, నిజాంసాగర్ మండలం మగ్దుంపూర్‌లో 9.6, మాచారెడ్డి మండలం లచ్చాపేటలో 9.7, గాంధారి మండలం సర్వాపూర్‌తో పాటు దోమకొండలో 9.9 డిగ్రీల చొప్పున అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 5 గంటలకే చలి ప్రభావం కనిపిస్తోంది. ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత కొనసాగుతోంది. దీంతో జనం ఇబ్బంది పడుతున్నారు. అనేక మంది చిన్నారులు, వృద్ధులు, జలుబు, దగ్గు జ్వరం లాంటి సమస్యలతో ఆస్పత్రులకు వెళ్తున్నారు. చలి తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు వైకుంఠ ఏకాదశి

- భక్తులకు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



నిజామాబాద్ సిటీ : ముక్కోటి ఏకాదశి వేడుకలకు జిల్లాలోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని అన్ని వైష్ణవాలయాల ఉత్తర ద్వారాలు నేడు బ్రహ్మ ముహుర్తాన తెరుచుకోనున్నాయి. ఈ ద్వారం వెంట వెళ్లి స్వామిని దర్శించుకుంటే పుణ్యప్రదమని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు, జిల్లాలోని వైష్ణవాలయాల ఉత్తరద్వారాలను అందమైన పూలతో, రంగురంగుల విద్యుత్ లైట్లతో అలంకరించారు. నగరంలోని జెండా బాలాజీ ఆలయం, గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రం, ఆర్యనగర్ వెంకటేశ్వర ఆలయం, సుభాష్‌నగర్ కోదండ రామాలయం, సాయినగర్‌లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఖిల్లా రఘునాథాలయం ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి ద్వారం గుండా స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

సదాశివనగర్: సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సింధు శర్మ తనిఖీ చేశారు. సీఐ రామన్, ఎస్సై రాజుతో మాట్లాడి స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, ఇతర కేసు వివరాలను తెలుసుకున్నారు. మాక్లూర్‌కు చెందిన ఆరుగురిని హత్య చేసిన కేసు విషయమై ఆరా తీశారు.

ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్‌గా నియామకం



నిజాంసాగర్: కాంగ్రెస్ పార్టీ విచార్ విభాగ్ నేషనల్ కోఆర్డినేటర్‌గా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నియమితులయ్యా రు. ఈ మేరకు ఏఐసీసీ విచార్ విభాగ్ చైర్మన్ గిరిజా వ్యాస్ శుక్రవారం నియామక పత్రాన్ని జారీ చేశారు. తనపై నమ్మకంతో కోఆర్డినేటర్‌గా నియమించిన కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, మల్లికార్జున్ ఖర్గేలకు లక్ష్మీకాంతారావు కృతజ్ఞతలు తెలిపారు.

'మహాలక్ష్మి'కి స్పందన

ఖలీల్‌వాడి : మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సులలో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో సగటున ప్రయాణికుల సంఖ్య గతంలో నిత్యం 1.70 లక్షల వరకు ఉండేది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆ సంఖ్య 2.60 లక్షలకు పెరిగింది. ఇందులో 60 శాతం వరకు మహిళలు ఉన్నారు. గరుడ, రాజధాని, డీలక్స్ బస్సులలో ప్రయాణికుల సంఖ్య యథావిధిగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోలు ఉండగా మొత్తం 615 బస్సులు 256 రూట్లలో తిరుగుతున్నాయి. గతంలో ఆర్టీసీకి నిత్యం రూ.90 లక్షల ఆదాయం రాగా ఇప్పుడు రూ.1.15 కోట్ల ఆదాయం వస్తుంది.

అన్ని రూట్లలో బస్సులు నడుస్తున్నాయి

రీజియన్ పరిధిలో అన్ని రూట్లకు బస్సులు నడుస్తున్నాయి. మహాలక్ష్మి పథకంతో రద్దీ పెరిగింది. మహిళలు ఉచిత టికెట్ కోసం తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపాలి.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం

మళ్లీ మైక్రో పడగ!

- గ్రామీణ మహిళలకు అప్పులు
- ఇన్సూరెన్స్ ఉచితమంటూ మాయమాటలు
- అడ్డగోలు వడ్డీలతో నడ్డి విరుస్తున్న కంపెనీలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రుణాలు ఇవ్వడంతో పాటు వడ్డీ వాపస్ చేస్తున్నా.. మహిళలు మాత్రం మైక్రో ఫైనాన్స్‌ల ఉచ్చులో చిక్కుకుంటూనే ఉన్నారు. వారి మాయమాటలు నమ్మి రుణాలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత అడ్డగోలు వడ్డీలు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతూ అవస్థలు పడుతున్నారు. గతంలో మైక్రో ఫైనాన్సులతో చిత్తయిన గ్రామీణ ప్రాంత ప్రజలు మరోసారి అవే ఫైనాన్స్‌ల వలలో చిక్కుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలను మైక్రో ఫైనాన్స్‌లు టార్గెట్ చేసుకుంటున్నాయి. మైక్రో ఫైనాన్స్‌ల ఏజెంట్లు రోజూ ఊరూరు తిరుగుతూ పేద మహిళలతో సమావేశమవుతున్నారు. తమ సంస్థలో రుణం తీసుకుంటే ఇన్సూరెన్స్ ఉంటుందని నమ్మిస్తున్నారు. ఏదైనా పరిస్థితుల్లో రుణం తీసుకున్నవారు మరణిస్తే లోన్ మాఫీ అవుతుందని చెబుతున్నారు. తీసుకున్న రుణానికి పదిహేను రోజులకోసారి వాయిదాలు చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు. మొదట్లో రూ.20 వేలు మాత్రమే రుణంగా ఇచ్చేవారు. ఇప్పుడు రూ.50 వేలు ఇస్తున్నారు. ఇటీవల బైకుల కొనుగోలు, హౌజింగ్ లోన్స్ కూడా ఇస్తామని ఊళ్లల్లో తిరుగుతున్నారు.

అడ్డగోలు వడ్డీలు...

ప్రభుత్వం మహిళా సంఘాలకు జీరో వడ్డీకే రుణాలిస్తున్నాయి. మరోవైపు మైక్రో ఫైనాన్స్ కంపెనీలేమో 18 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. అయినా పేదలు వీరి ఉచ్చులో చిక్కుతూనే ఉన్నారు. జిల్లాలో జాతీయ రహదారిపై ఉన్న భిక్కనూరు మండలంపై మైక్రో ఫైనాన్స్ కంపెనీలు ఎక్కువగా ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో వేలాది మందికి అప్పులు ఇచ్చినట్లు సమాచారం. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఏజెంట్లు నిబంధనలకు విరుద్ధంగా రుణాలిస్తూ, అడ్డగోలు వడ్డీలను వసూలు చేస్తున్నా అధికారులు వారిని అడ్డుకోలేకపోతున్నారు. ఎవరైనా గట్టిగా అడిగితే మహిళలను వారిపైకి ఉసిగొల్పుతున్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల ప్రజలు నిలదీస్తున్నా.. అప్పు అవసరం ఉన్నవారు మైక్రో ఫైనాన్స్‌లకు అండగా నిలుస్తూ, ఎదురుదాడికి దిగుతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్ దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అవసరానికి అప్పు తీసుకుంటున్న పేద మహిళలు అధిక వడ్డీలతో ఇబ్బందులు పడుతున్నారు. అప్పు తీర్చడం కోసం మళ్లీ కొత్త అప్పులు చేస్తున్నారు. దీంతో పేదలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అధికారులు స్పందించి, మైక్రో ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్వాక్రా సంఘాలను దెబ్బతీస్తూ..

మహిళల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యం దిశగా ముందుకు నడిపించిన స్వయం సహాయక సంఘాలను మైక్రో ఫైనాన్స్‌లు దెబ్బతీస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులను చేరదీసి వారికి మాయ మాటలు చెబుతూ డ్వాక్రా సంఘాల నుంచి తీసుకున్న డబ్బులు చెల్లించకున్నా ఏమీ కాదని, వాటిని కట్టకుండా వదిలేయాలని తప్పుదారి పట్టిస్తున్నారు. రుణాలను ప్రభుత్వాలు మాఫీ చేస్తాయని కూడా చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో డ్వాక్రా సంఘాల్లో అప్పటికే వారు తీసుకున్న అప్పుల భారం పెరిగిపోతోంది. తీసుకున్న అప్పు చెల్లించాలని తోటి సభ్యులు ఒత్తిడి తీసుకువచ్చే పరిస్థితి ఏర్పడుతోంది.

'సహకారం'లో అవిశ్వాసం

- ఇప్పటికే నోటీసులిచ్చిన రాజంపేట సొసైటీ సభ్యులు
- వచ్చేనెల 2న ఓటింగ్‌కు నిర్ణయం
- మరికొన్ని సంఘాల్లోనూ జోరుగా ప్రయత్నాలు



సాక్షి, కామారెడ్డి: సహకార సంఘాల్లో అవిశ్వాసం రగడ మొదలైంది. విండో చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం ప్రకటించి ఆయా పదవులను కైవసం చేసుకోవాలని పలుచోట్ల మిగతా సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రాజంపేట సహకార సంఘంలో విండో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి సభ్యులు నోటీసు ఇచ్చారు. ఆ సొసైటీలో వచ్చే నెల 2న అవిశ్వాసానికి ఓటింగ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ అవిశ్వాసం గండం నుంచి బయటపడేందుకు ప్రస్తుతం ఉన్న చైర్మన్, వైస్ చైర్మన్లు డైరెక్టర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఓ డైరెక్టర్‌ను తమ వైపు తిప్పుకుని విహార యాత్రకు తీసుకువెళ్లారు. మరికొన్ని సహకార సంఘాల్లో చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులపై కన్నేసిన సభ్యులు అవిశ్వాసం పెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

గందరగోళం..

విండో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి సంబంధించి ఎంత మంది సభ్యుల మద్దతు ఉండాలన్న దానిపై గందరగోళం నెలకొంది. పంచాయతీరాజ్ చట్టానికి, సహకార చట్టానికి తేడా ఉంటుంది. పంచాయతీరాజ్‌కు సంబంధించి స్థానిక సంస్థల్లో అవిశ్వాస నోటీస్ ఇచ్చిన తర్వాత నిర్వహించే సమావేశంలో హాజరైన సభ్యుల్లో మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటేస్తే అవిశ్వాసం నెగ్గుతుంది. లేదంటే అవిశ్వాసం వీగిపోతుంది.

ఇతర సొసైటీలలోనూ..

జిల్లాలోని పలు సొసైటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి డైరెక్టర్లు పావులు కదుపుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయా సహకార సంఘాల్లో కొందరు డైరెక్టర్లు అధికార పార్టీ అండతో అవిశ్వాస తీర్మానం నోటీసులివ్వడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మెజారిటీ విండోలు బీఆర్‌ఎస్ పార్టీ చేతిలో ఉండగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు అవిశ్వాసాలు పెట్టి పదవులను కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

2/3 మెజారిటీ ఉంటేనే..

ప్రతి సహకార సంఘంలో 13 మంది సభ్యులు ఉంటారు. చైర్మన్ మీద గానీ, వైస్ చైర్మన్ మీద గానీ అవిశ్వాసం ప్రతిపాదించిన తర్వాత అవిశ్వాస తీర్మానం కోసం సమావేశం పెట్టినపుడు మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది అనుకూలంగా ఓటేయాల్సి ఉంటుందని సహకార శాఖ అధికారులు చెబుతున్నారు. 13 మంది సభ్యుల్లో 9 మంది సభ్యులు కచ్చితంగా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేస్తేనే ఆ తీర్మానం నెగ్గుతుందన్న మాట. 13 మంది సభ్యుల్లో ఒక సభ్యుడు చనిపోయినా, లేదా రాజీనామా చేసి ఖాళీ ఏర్పడినా కూడా తొమ్మిది మంది సభ్యుల మద్దతు ఉండాల్సిందేనని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

క్రాప్‌లోన్ కోసం వెళ్లి షాకైన రైతులు

- రుణం తీసుకోకున్నా తీసుకున్నట్లు చూపించిన బ్యాంక్ అధికారులు
- న్యాయం చేయాలని వేడుకోలు

సదాశివనగర్: పంట రుణం కోసం బ్యాంకుకు వెళ్లిన ఆ రైతులు షాక్‌కు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. లింగంపల్లి గ్రామానికి చెందిన పదిమంది రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వెళ్లారు. క్రాప్ లోన్ ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరగా.. వారు పరిశీలించి ఇప్పటికే మీ పేరుపై పంట రుణం ఉందని చెప్పారు. లింగంపల్లికి చెందిన బాల్‌రాజ్ అనే వ్యక్తి గతంలో బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్నాడు. ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో రూ. 93 వేలు మాఫీ అయ్యాయి. వడ్డీ కింద రూ. 7,700 చెల్లించాడు. అతడి పేరుపై రూ. 1.90 లక్షల రుణం ఉందని బ్యాంకు అధికారులు చెప్పారు. పది మంది పేరుపైనా రుణాలున్నాయని చెప్పడంతో రైతులు అవాక్కయ్యారు. బ్యాంకు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ ప్రమేయం లేకుండా బ్యాంక్ అధికారులు రుణం ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

'విద్యార్థులు గణితంలో ప్రతిభ చాటాలి'



కామారెడ్డి టౌన్: విద్యార్థులు గణితంలో రాణించాలని డీఈవో ఎస్.రాజు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాలలో నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం, సైన్స్ సబ్జెక్టులు ముఖ్యమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, సోషల్ మీడియాకు బానిసలు కావద్దని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు రుణాలివ్వాలి

- కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



బ్యాంకర్లకు సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: బ్యాంకర్లు తమ లక్ష్యానికి అనుగుణంగా రైతులకు రుణాలు అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పాడి, మత్స్య పరిశ్రమలకు ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రుణాలు మంజూరు చేయాలన్నారు. అర్హత గల రైతులతోపాటు మున్సిపాలిటీల పరిధిలోని అర్హులైన వీధి వ్యాపారులకు లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలన్నారు. సకాలంలో రుణాలను చెల్లించిన స్వయం సహాయక సంఘాలకు రెట్టింపు రుణాలు ఇవ్వాలని సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అర్హత గల వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల రుణ వితరణ, పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్ కుమార్, ఎల్‌డీఎం సుధీర్ భార్గవ్, డీఆర్‌డీవో సాయన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, ఎస్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుల వివరాలివ్వాలి

సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను ఈనెల 29 న వ్యయ పరిశీలకులకు అందజేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్టర్‌లో నమోదు చేసిన విధంగా అన్ని రకాల రోజువారీ ఖర్చుల వివరాలు తెలియజేయాలన్నారు. అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను గడువులోగా ఇవ్వకపోతే మూడేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు అవుతారని హెచ్చరించారు. బ్యానర్‌లు, పోస్టర్‌లు, దినపత్రికలు, టీవీ చానల్స్‌లలో ఇచ్చిన ప్రకటనల వివరాలు, వాటికైన ఖర్చులు కూడా తెలపాలన్నారు. జనవరి 2లోగా అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలు పూర్తి స్థాయిలో అందజేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. సరైన వివరాలు ఇవ్వని అభ్యర్థులకు ఈసీ నోటీసులు ఇస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి కిషన్, ఎన్నికల విభాగం అధికారి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మీ కష్టంతోనే ఎమ్మెల్యేనయ్యా

- జీవితాంతం మీకు రుణపడి ఉంటా
- కార్యకర్తల సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ''అసెంబ్లీ ఎన్నికల్లో నా గెలుపు కోసం కార్యకర్తలు విశేషంగా కృషి చేశారు. ఓటర్ల కాళ్లు పట్టుకుని మరీ ఓట్లడిగి నన్ను ఎమ్మెల్యేను చేశారు. మీకు జీవితాంతం రుణపడి ఉంటా'' అని కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచకున్నా ప్రజలు బీజేపీని గెలిపించారన్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిలాంటి ఉద్దండులను ఓడించిన కామారెడ్డి నియోజకవర్గంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. బీజేపీ అధిష్టానం ఇక్కడి గెలుపు విధానం కార్యకర్తల కృషిని ఆదర్శంగా తీసుకోనుందన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తా

తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఇచ్చిన హామీలన్ని నెరువేర్చుతానని కేవీఆర్ పేర్కొన్నారు. ఫోన్ లిఫ్ట్ చేయడంలేదని ఎవరూ తనపై కోపం పెంచుకోవద్దన్నారు. ఇప్పటికీ రోజూ వేలాది వాట్సాప్ మెస్సేజ్‌లు, ఫోన్ కాల్స్ వస్తున్నాయన్నారు. ఇక ప్రజల వద్దకు వెళ్దామని, కామారెడ్డిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని పేర్కొన్నారు. తన పదవి నియోజకవర్గ ప్రజలు పెట్టిన భిక్ష అని, తనను ఎమ్మెల్యేగా కాకుండా సాధారణ వ్యక్తిగానే చూడాలని కోరారు. ఆవేశం వద్దని, గ్రామాల్లో శత్రువులను, వ్యతిరేకులను సైతం మిత్రులుగా చేసుకోవాలని సూచించారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాలు బీజేపీ బలపరిచే అభ్యర్థులే గెలవాలని, ఆ దిశగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 2028లో బీజేపీ అధికారంలోకి రాకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. కార్యకర్తలకు సాష్టాంగ ప్రణామం చేస్తున్నానంటూ ప్రసంగాన్ని ముగించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి బద్దం మహిపాల్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, కౌన్సిలర్లు శ్రీకాంత్, నరేందర్, ప్రవీణ్, శ్రీనివాస్, నాయకులు ఆకుల భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన కార్యకర్తలు

యూనివర్సిటీ స్థాయి క్రీడల్లో 8 పతకాలు



క్రీడాకారులను సన్మానిస్తున్న అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తా చాటి, 8 పతకాలు సాధించారు. 400 మీటర్ల పరుగులో ఎం.రాహుల్ (బీఏ సెకండియర్) ప్రథమ స్థానం, ఎ.కృష్ణ (బీఎస్సీ, బీజెడ్‌సీ సెకండియర్) ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. పది కిలోమీటర్ల పరుగులో సీహెచ్. సంతోష్(బీఏ సెకండియర్) తృతీయ స్థానం, రెండు వందల మీటర్ల పరుగులో ఎం.రాహుల్ ద్వితీయ స్థానం, బి.హరిత (బీఎస్సీ ఎంపీసీ) ప్రథమ స్థానం పొందారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఇన్‌చార్జి పీడీ శ్రీనివాస్‌రావు క్రీడాకారులను సన్మానించారు.

చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న రసూల్ బీ

డిచ్‌పల్లి: పిల్లలు లేని దంపతులు చట్టపరంగా దత్తత తీసుకోవాలని అప్పుడే ఎలాంటి సమస్యలు రావని ఐసీడీసీ పీడీ రసూల్ బీ సూచించారు. శుక్రవారం డిచ్‌పల్లిలోని మానవతా సదన్‌లో మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ, వేర్‌ఆర్ ఇండియాస్ చిల్డ్రన్స్ సంస్థ సంయుక్తంగా దత్తత ప్రక్రియపై నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. చిల్డ్రన్ హోమ్స్‌లో, అనాథాశ్రమాల్లో పిల్లలను ఉంచకుండా పిల్లలు లేని వారు ప్రభుత్వం సూచించిన పద్ధతిలో దత్తత తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దత్తత ఎలా తీసుకోవాలనే విషయమై వేర్ ఆర్ ఇండియాస్ చిల్డ్రన్ సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోష్ శిక్షణ నిచ్చారు. ఈ శిక్షణలో ఉమ్మడి జిల్లాకు చెందిన బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బాలల పరిరక్షణ అధికారులు చైతన్య కుమార్, స్రవంతి, బాలరక్ష భవన్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి, మానవత సదన్ కేర్‌టేకర్ రమేశ్, సిబ్బంది, కొందరు దంపతులు పాల్గొన్నారు.

పుర సమస్యలపై చర్చించేనా!

- నేడు బల్దియా సర్వసభ్య సమావేశం
- హాజరు కానున్న ఎమ్మెల్యే కేవీఆర్


కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం కౌన్సిల్ హాల్‌లో జరగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హాజరు కానున్నారు. గతంలో బల్దియాలో అవినీతి, అక్రమాలు, కబ్జాలపై ఆయన పోరాటాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో సైతం ప్రధానంగా బల్దియా అవినీతిపై విమర్శలు చేశారు. తాను గెలిచాక మున్సిపల్‌ను గాడిలో పెట్టి అవినీతిని అంతం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యే అయ్యాక మొదటి సారి కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్నారు. మరి గతంలో చేసిన విమర్శలు, పుర సమస్యలు, పెండింగ్ పనులు, పాలన తీరుపై ప్రశ్నిస్తారా..! చర్చలు జరుపుతారా..! అని సర్వత్రా ఎదురుచూస్తున్నారు.

16 ఎజెండా అంశాలు సిద్ధం

వినాయక, బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్ల బిల్లులు చెల్లింపులు, ఆయా వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులు, హరితహారం బిల్లులు, నీటి సరఫరా నిర్వహణ, మరమ్మతులు, వీధిదీపాల బిల్లులు, పారిశుధ్య వాహనాల డీజిల్ బిల్లులు తదితర 16 అంశాలతో కూడిన ఎజెండాపై సమావేశంలో చర్చించనున్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి సన్మాన కార్యాక్రమం ఏర్పాటు చేశారు.

పెండింగ్ పనులపై..

పట్టణంలో చాలా ఏళ్లుగా పెండింగ్ పనులు ఉన్నాయి. కొత్త బస్టాండ్ నుంచి హౌజింగ్ బోర్డు వరకు రూ.10 కోట్లతో నిర్మిస్తున్న ఫుట్‌పాత్, డ్రెయినేజీ పనులు, గాంధీ గంజ్‌లో రూ.9కోట్లతో చేపట్టిన మాంసం, శాఖహార సమీకృత దుకాణాల పనులు, రూ. 2కోట్లతో చేపట్టిన రెండు వైకుంఠధామాలో పనులు నిలిచిపోయాయి. 4 ఏళ్ల క్రితం రూ.50లక్షలతో నిర్మించిన రైతు బజార్ షెడ్లు, 16ఏళ్ల క్రితం సుభాష్‌రోడ్‌లో నిర్మించిన మాంసం విక్రయ దుకాణాలు నయా పైసా ఆదాయం లేకుండా వృథాగా ఉన్నాయి. అలాగే మున్సిపల్ పక్కన, భగత్‌సింగ్‌నగర్‌లో వీధి వ్యాపార దుకాణాలు వృథాగా ఉన్నాయి. నిజాంసాగర్ చౌరస్తా, ఇందిరా చౌక్, కొత్తబస్టాండ్, ఇలా ఆరుచోట్ల జంక్షన్‌ల విస్తరణ, ఆక్రమణలకు గురవుతున్న రూ.కోట్ల విలువ చేసే బల్దియా స్థలాల భద్రత తదితర సమస్యలపై చర్చించాల్సి ఉంది.

క్లుప్తంగా

నేడు శ్రీమద్భగవద్గీత శ్లోక పఠన, భజన పోటీలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో గీతా జయంతిని పురస్కరించుకొని సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో శనివారం శ్రీమద్భగవద్గీత శ్లోక పఠన, భజన పోటీలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతులు మచాలే బాబా, కన్హైరాజ్ బాబాలు తెలిపారు. ఈ పోటీల్లో 6–10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.ప్రతి పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులను తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నేడు, రేపు సత్యసాయి టెలిమెడిసిన్ సేవలు

కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి ప్రాణ మిత్ర ఉచిత టెలి మెడిసిన్ సేవ కింద శని, ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 26 మంది వైద్యులు అందుబాటులో ఉంటారని శ్రీసత్యసాయి సేవా సమితి కామారెడ్డి శాఖ కన్వీనర్ ఎస్.లింబాద్రి తెలిపారు. పూర్తి వివరాలకు 080-47179797 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి, మల్లుపల్లి, అయ్యవారిపల్లి, ఇసన్నపల్లి, భాగిర్తిపల్లి గ్రామాల్లో శనివారం(నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం తెలిపారు.శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందన్నారు. ప్రజలకు సహకరించాలని కోరారు.

వైభవంగా రథోత్సవం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి శ్రీకృష్ణ మందిరంలో దత్త జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవం ఎంతో ఆకట్టుకుంది. మందిరం నుంచి మొదలుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. గోపాల కృష్ణ మహరాజ్‌కి జై అంటూ భజన కీర్తనలు ఆలపిస్తూ రథోత్సవం నిర్వహించారు. పీఠాధిపతులు మచాలే బాబా, కన్హైరాజ్ బాబా, శ్రీ కృష్ణ సేవాసమితి ప్రతినిధులు సారంగ్ బాబా, సర్పంచ్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ స్టేజీ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించేందుకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధి క శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో నేరుగా డెమోకు హాజరు కావాలని కోరారు.

నిజాంషుగర్స్ లేఆఫ్‌కు నేటితో ఎనిమిదేళ్లు..


బోధన్ ఎన్డీఎస్ఎల్ ముఖచిత్రం(ఫైల్)

బోధన్: నిజాంషుగర్స్(ఎన్డీఎస్ఎల్) లేఆఫ్ ప్రకటించి శనివారంతో ఎనిమిదేళ్లు పూర్తయ్యింది. 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీ ప్రైవేటు యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజిపల్లి(మెదక్) యూనిట్లను మూసివేసింది. దీంతో వందల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. రైతులు చెరుకు సాగుకు దూరమై నష్టాల పాలయ్యారు. ఫ్యాక్టరీని తెరిపించాలని ప్రధాన రాజకీయ పార్టీలు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికులు ఇప్పటికీ పోరాడుతున్నారు. 2014 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని పూర్వవైభవం తెస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ తెరుచుకోలేదు. కనీసం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కాగా ఉపాధి కోల్పోయిన కార్మిక కుటుంబాలు అధోగతి పాలయ్యాయి. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌లో అపార అవకాశాలు


క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి

తెయూ(డిచ్‌పల్లి): క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని, భవిష్యత్తులో అనేక మందికి ఉపాధి లభిస్తుందని రిసోర్స్‌పర్సన్స్, ఆస్పైర్ క్లినిక్ అకాడమీ(వరంగల్) ప్రతినిధులు బి.కృష్ణవేణి, ఎస్.ప్రియాంక పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'క్లినికల్ డాటా అవకాశాలు– సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ఆధునిక సమాజంలో క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌లో అనేక రకాల నైపుణ్యాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకున్న వారు ఉపాధి అవకాశాలు పొందుతారని తెలిపారు. తెయూ ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు ఆస్పైర్ క్లినిక్ అకాడమి తరఫున ఇంటర్న్‌షిప్‌తో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో–ఆర్డినేటర్ బోయపాటి శిరీష, అధ్యాపకులు ప్రొఫెసర్ నసీం, వాసం చంద్రశేఖర్, మావురపు సత్యనారాయణ, నర్సయ్య, రమ్య పాల్గొన్నారు.

మూతపడిన కళాశాలలో అగ్నిప్రమాదం

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు వెళ్లే దారిలో మూతపడిన కళాశాలలో అగ్ని ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి కళాశాలలోని రెండు గదుల్లో ఉన్న కుర్చీలకు దుండగులు నిప్పంటించారని భావిస్తున్నారు. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కళాశాలకు సంబంధించిన కుర్చీలు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ చలాన్లపై భారీ డిస్కౌంట్

- రాయితీని సద్వినియోగం చేసుకోవాలంటున్న పోలీసులు
- గతేడాది జిల్లాలో వసూలైన పెండింగ్ చలాన్లు సుమారు రూ. 4 కోట్లు

ఖలీల్‌వాడి : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను వసూలు చేసేందుకు పోలీసుశాఖ సిద్ధమైంది. ఇందుకోసం భారీగా రాయితీలు ప్రకటించింది. గతేడాది ఇలాగే డిస్కౌంట్ ప్రకటించడంతో ఏకంగా రూ. 4 కోట్ల వరకూ పెండింగ్ చలాన్లు వసూలైనట్లు తెలిసింది. మళ్లీ ఇదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. 2022 డిసెంబర్ 31 నాటికి జిల్లాలో 3.88 లక్షల చలాన్లకు రూ.12.30 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో ఇంకా కొన్ని చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో గతేడాది ప్రత్యేక రాయితీ ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం, బైక్‌లయితే 80 శాతం, కార్లు, ఆటోలకు 60 శాతం రాయితీ, మిగితా భారీ వాహనాలకు 50 శాతం రాయితీ ఇచ్చారు. డిసెంబర్ 26 నుంచి జనవరి 16 వరకు ఈ చలాన్లను చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలో చలానాలు చెల్లించేవారికే ఈ రాయితీ వర్తిస్తుంది.

అర్థశాస్త్ర పరిశోధనలే ఆర్థిక ప్రగతికి మూలాధారం



తెయూ(డిచ్‌పల్లి): అర్థశాస్త్ర పరిశోధనలే దేశ ఆర్థిక ప్రగతికి మూలాధారని అర్థశాస్త్ర విభాగాధిపతి పున్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'దత్తాంశ సేకరణ అనువర్తనీయత' అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోడరేటర్స్‌గా పాల్గొన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ న్యానేశ్వర్, వెంకటేశ్‌లు మాట్లాడుతూ.. ప్రామాణికమైన దత్తాంశంతోనే వాస్తవ ఫలితాలు వస్తాయన్నారు. దత్తాంశ సేకరణకు నిబద్ధతతో ప్రశ్నావళిని రూపొందించుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా వన్ నేషన్ వన్ రేషన్ అనే నినాదంతో ప్రజా పంపిణీ పథకాన్ని ముందుకు తీసుకుపోవాలని ప్రధాని ప్రకటించిన సందర్భంగా ఒక సర్వేను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్, పాత నాగరాజు, స్వప్న, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పాల్గొన్న అధికారులు

- విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. టెస్ట్ విద్యార్థులు తమ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేలా ప్రతి విద్యార్థి వారీగా చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఫలితాల్లో జిల్లాను ముందంజలో నిలపాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తిస్తూ, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ముఖ్యంగా ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను గమనించాలని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ అత్యుత్తమ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఈ మేరకు ఎంఈవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వార్షిక పరీక్షలకు మరో మూడు నెలల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ నాణ్యమైన విద్యను బోధించేలా చొరవ చూపాలన్నారు. విద్యార్థుల కాపీయింగ్ వంటి వాటిపై ఆధారపడకుండా, తమ స్వశక్తితో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించేలా వారిని సన్నద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఈవో దుర్గాప్రసాద్, జీసీడీవో వనిత, ఏసీఈ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఇంటర్ కాలేజీ ఖోఖో జట్ల ఎంపిక


వర్సిటీ ఇంటర్ కాలేజీ ఖోఖో ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం క్యాంపస్ క్రీడామైదానంలో రిజిస్ట్రార్ యాదగిరి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. తెయూ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి సుమారు వందమందికి పైగా క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడా పోటీలకు పంపనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. డిసెంబర్ 26 నుంచి 30వరకు కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల జట్టు పోటీలు జరుగుతాయని తెలిపారు. అలాగే డిసెంబర్ 26 నుంచి 29వరకు తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో మహిళల జట్టు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ క్రీడావిభాగం డైరెక్టర్ బాలకిషన్, ఫిజికల్ డైరెక్టర్స్ బీఆర్‌నేత, అనిల్ కుమార్, సౌమ్య, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ జాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యే శరణ్యం..

- భార్య, కూతురుతో కలిసి వార్డుమెంబర్ నిరసన
- మూడేళ్లయినా బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన


భార్య, కూతురుతో కలిసి పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న శైలేందర్

నవీపేట: మూడేళ్ల కిందట చేపట్టిన ఇంకుడు గుంతల పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా చెల్లించలేదని ఓ వార్డు మెంబర్ గురువారం నవీపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. భార్య, కూతురుతో కలిసి వచ్చి అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టాడు. మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు ఎత్తొండ శైలేందర్ 2020–21లో 170 ఇంకుడు గుంతల నిర్మాణం చేయించాడు. నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో అప్పుచేసి వాటిని పూర్తి చేయించాడు. 73 ఇంకుడు గుంతలకు ఈజీఎస్‌పై ఏపీవో రాజేశ్వర్ రూ. 2లక్షల వరకు బిల్లులు చెల్లించాడు. ఈ బిల్లుల చెల్లింపునకు ఏపీవో రూ. 20వేలు లంచం తీసుకున్నాడని బాధితుడు ఆరోపించాడు. మిగతా డబ్బులు చెల్లించాలని అడగగా మరో రూ. లక్ష లంచం ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నాడని బాధితుడు శైలేందర్ కన్నీరు పెట్టుకున్నాడు. మాకు ఆత్మహత్యే దిక్కని.. కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు తాగి చనిపోతామని ఆందోళన చేపట్టాడు. స్పందించిన ఎంపీడీవో సాజిద్‌అలీ తన చాంబర్‌లోకి పిలిపించుకుని వివరాలు తెలుసుకున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఏపీవో రాజేశ్వర్, జీపీ కార్యదర్శి అఖిల్‌ను ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎంపికైన చిన్నమల్లారెడ్డి విద్యార్థి నితిన్

కామారెడ్డి రూరల్: 67వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్–14 కబడ్డీ పోటీలకు మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన నితిన్(8 వ తరగతి) ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాల్సిందిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తానోబా ఆనందరావు ఆకాంక్షించారు.

పెద్దదగ్గి పాఠశాల విద్యార్థిని..


శృతికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బిచ్కుంద(జుక్కల్): పెద్దదగ్గి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శృతిక జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పీఈటీ సత్యం తెలిపారు. అండర్–14 కబడ్డీ బాలిక విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. జనగామ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో జిల్లా నుంచి పోటీలలో పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు సన్మానించారు.

విద్యుత్‌శాఖ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు అభినందన



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖ రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఎస్ఈ రవీందర్ శుక్రవారం అభినందించారు. ఈనెల 18 నుంచి 20 వరకు ఖమ్మం జిల్లాలో ఇంటర్ సర్కిల్ కబడ్డీ, టెన్నీస్ టోర్నమెంట్లు జరిగాయి. ఇందులో కబడ్డీలో నిజామాబాద్ జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎస్ఈ అభినందించారు. కార్యక్రమంలో డీఈటీ రమేష్, ఎస్ఏవో రాజశేఖర్, ఏఏవో గంగారాం, ఏడీ తోట రాజశేఖర్, జేఏవో సురేష్, మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


రుద్రూర్ శివారులో ఘటనా స్థలం వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు


లక్ష్మణ్(ఫైల్)

రుద్రూర్: రుద్రూర్ మండలం అంబం(ఆర్) క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంకు చెందిన దిమ్మల్‌వార్ లక్ష్మణ్ (25) పంక్షన్‌కు వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే సమయంలో రుద్రూర్‌కు చెందిన సాయి కుమార్ అనే యువకుడు బైక్‌పై పొలానికి వెళ్తుండగా అంబం (ఆర్) క్రాస్ రోడ్డు సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన సాయికుమార్‌ను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నరేశ్ పరిశీలించి మృతదేహాన్ని బోధన్ ఏరియాస్పత్రికి తరలించారు.

ప్రధాన రహదారిపై బాధితుల ఆందోళన

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతంలో శుక్రవారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు రాక ముందే మృతదేహాన్ని ఆస్పత్రికి ఎందుకు తరలించారని పోలీసులను ప్రశ్నించారు. ప్రమాదానికి గురైన బైకులను కూడా ఘటనా స్థలం నుంచి తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మణ్ మృతిపై అనుమానం ఉందని ఆరోపించారు. ఎస్సై నరేశ్ ఘటనా స్థలానికి వచ్చి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..


వృద్ధుడి మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ స్టేజీ వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి వైపు నుంచి నిజామాబాద్ వైపునకు మేకల లోడ్‌తో వెళ్తున్న బోలేరో వాహనం గురువారం రాత్రి కుప్రియాల్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

యువతి అదృశ్యం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. గురువారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత, ఆమె బయటకి వెళ్లి వస్తానని చెప్పి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి శుక్రవారం రామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


శివాని మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): స్నేహితురాలి పెళ్లి విషయంలో భర్తతో గొడవపడి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన జుక్కల్ మండలం శక్తినగర్‌లో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సత్యనారాయణ తెలిపిన కథనం ప్రకారం.. జుక్కల్ మండలం గుండూరుకు చెందిన శివాని తన స్నేహితురాలి పెళ్లికి వెళ్తానని భర్త పాండురంగ్‌ను కోరింది. స్నేహితురాలి పెళ్లి హైదరాబాద్‌లో ఉండడంతో.. పెళ్లికి కాకుండా శక్తినగర్‌లో జరిగే పెళ్లి కార్యక్రమాల్లో పాల్గొని వచ్చేయని భర్త చెప్పి పంపించారు. నాలుగు రోజుల క్రితం ఏడాదిన్నర కూతురుతో కలిసి శక్తినగర్‌కు వచ్చిన శివాణి తన స్నేహితురాలి పెళ్లి కార్యక్రమాల్లో పాల్గొంది. అలాగే హైదరాబాద్‌లో జరిగిన పెళ్లికి కూడా వెళ్లి తిరిగి శక్తినగర్‌కు వచ్చింది. పెళ్లి పూర్తి కావడంతో గురువారం భార్యను తీసుకెళ్లేందుకు శక్తినగర్ వచ్చిన పాండురంగ్ భార్యతో గొడవ పెట్టుకున్నాడు. హైదరాబాద్‌కు వద్దని చెప్పినా ఎందుకు వెళ్లావని భార్యపై కోపాద్రిక్తుడయ్యాడు. గొడవను ఇరుగుపొరుగు వారు సద్దుమణిగించారు. అనంతరం గురువారం రాత్రి ఏడు ప్రాంతంలో పాండురంగ్ తన భార్య శివాని, కూతురుతో ద్విచక్రవాహనంపై గుండూరుకు బయలు దేరారు. మార్గమధ్యలో శక్తినగర్ వంతెన దగ్గరకు రాగానే చలి ఎక్కువగా ఉందని.. కూతురికి టోపీ పెడతానని బండి ఆపాలని శివాని భర్తకు చెప్పింది. పాండురంగ్ బండిని ఆపగా శివాని ఒక్కసారిగా వంతెనపై నుంచి నీటిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడింది. భర్త విషయాన్ని వెంటనే శక్తినగర్, గుండూరు గ్రామస్తులకు సమాచారమిచ్చాడు. వంతెన వద్ద నీరు అధికంగా ఉండడంతో శుక్రవారం మధ్యాహ్నం గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెరుకు తోట దగ్ధం



రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలో శుక్రవారం చెరుకు తోట దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తోట నారాయణ తనకున్న వ్యవసాయ భూమిలో మూడెకరాల 12 గుంటలలో చెరుకు సాగు చేస్తున్నాడు. ఉదయం పొలానికి వెళ్లి పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. భోజనం చేసి తిరిగి పొలానికి వెళ్లేలోగా చెరుకు పంట 80శాతానికి పైగా దగ్ధమైంది. దీంతో కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారి సహాయంతో మంటలను ఆర్పారు. స్థానిక ఆర్ఐ సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని పంట నష్టంపై పంచనామా నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


దుండగులు పగులగొట్టిన బీరువా

బీబీపేట: మండంలోని యాడారం గ్రామానికి చెందిన లక్కర్సు భిక్షపతి ఇంట్లో చోరీ జరిగింది. భిక్షపతి తాళం వేసి వెళ్లగా శుక్రవారం తెల్లవారుజామున దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తాళాలు తీసి అందులో ఉన్న రూ. 20వేలు, తులం బంగారం చైన్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.